క్లుప్తంగా

భద్రత మన బాధ్యత



విద్యుత్ కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏఈ శ్యామ్‌సుందర్

గోపాలపట్నం: గోపాలపట్నం విద్యుత్ శాఖ కార్యాలయంలో మంగళవారం సేఫ్టీ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ ప్రతి నెలా 2న సేఫ్టీ డే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉద్యోగులు వినియోగదారులు భద్రత పాటించాలన్నారు. ప్రమాదాలు ఎలా ఎదురవుతాయి, వాటి నుంచి ఎలా తప్పించుకోవాలన్న అంశాలను వివరించారు. భద్రతా పరికరాల వినియోగంలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. అనంతరం ఉద్యోగులు, సిబ్బంది చేత భద్రత మన బాధ్యతని ఏఈ ప్రతిజ్ఞ చేయించారు.

ఉక్కులో వాహనాల వేగానికి కళ్లెం

30 కి.మీ మించరాదని ఉత్తర్వులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో వాహన చోదకులు గంటకు 30 కిలోమీటర్ల వేగం మించరాదని ఉక్కు యాజమాన్యం నిర్దేశించింది. ఈ మేరకు ఉక్కు యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల భద్రత కోసం ఇప్పటికే ప్లాంట్ లోపల అనేక బోర్డులు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. విధుల ప్రారంభం వేళల్లో అధిక వేగంతో వాహనాలు ప్రయాణిస్తున్నట్టు గమనించినట్టు పేర్కొన్నారు. వేగ నియంత్రణపై పలు భద్రతా సమావేశాల్లో ఉద్యోగులకు సూచించినట్టు తెలిపారు. ఇకపై అపరిమిత వేగంతో ప్రయాణిస్తే భద్రతా అధికారులు, హోంగార్డులు ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం స్వర్ణలత, ఉపాధ్యాయులు

గోపాలపట్నం: రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం స్వర్ణలత అభినందించారు. గత నెల 28 నుంచి 31వరకు నెల్లూరు జిల్లాలో జరిగిన పోటీల్లో 10వ తరగతి చదువుతున్న కీర్తన, 9వ తరగతి విద్యార్థులు సంజన, దుర్గ, భవ్య ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో ఘనంగా సత్కరించి అభినందించారు. చదువుతో పాటు ఆటల్లో విద్యార్థులు రాణించాలన్నారు. కోచ్‌లు, పీడీలను ఆమె అభినందించారు.

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలో కొత్తగా పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల ప్రోత్సాహకాలు అందిస్తామని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. ఔత్సాహికులకు 18 ప్రభుత్వ శాఖల అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి ఎప్పుడైనా తనను సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు, సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం



పవిత్రాలకు పూజలు చేస్తున్న అర్చకులు

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం సాయంత్రం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, మృత్సంగ్రహణం, అంకురారోపణ, నీరాజన మంత్ర పుష్పం జరిపారు.



ఎన్‌ఏడీ జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జియ్యాని శ్రీధర్ తదితరులు



61వ వార్డులో రాజశేఖర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రామ్మోహనరెడ్డి , భోగవిల్లి తదితరులు



60వ వార్డులో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పి.వి.సురేష్, పార్టీ నాయకులు

జోహార్ రాజన్నా..

ఘనంగా వైఎస్సార్ వర్ధంతి



పద్మనాభనగర్‌లో పేదలకు రొట్టెలు అందిస్తున్న అప్పలస్వామి నాయుడు తదితరులు

గోపాలపట్నం: దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన నివాళులర్పించారు. సేవా కార్యక్రమాలు చేపట్టారు. నీవు మా మదిలో ఉన్నావు రాజన్నా అంటూ నినదించారు.

- ఎన్‌ఏడీ జంక్షన్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ అమర్ రహే.. జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ వైఎస్సార్ పేదల సంక్షేమం కోసం ఎన్నో మంచి పథకాలు తీసుకువచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ , ఫీజు రీయంబర్స్‌మెంట్ వంటి పథకాల ద్వారా లక్షలాది కుటుంబాలు లబ్ధి పొందాయన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు వెదుళ్ల శ్రీనివాసరావు, కంచిపాటి వెంకటరమణ, రాజు తదితరులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి ఆ వార్డు అధ్యక్షుడు గొర్లె అప్పలస్వామి నాయుడు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు రొట్టెలు, పండ్లు అందించారు. వైఎస్సార్ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలకు అదనంగా మరిన్ని పథకాలు అమలు చేసిన ఘనత ఆయన కొడుకు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సాలాపు మారయ్య, లోకేష్ రెడ్డి, కొండాపు సత్తిబాబు, కంపర రామకృష్ణ, యర్ర గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో ..

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలోని వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గులివిందల కృష్ణ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహానేత సేవలను కొనియాడారు. వార్డు నాయకులు సాల్మన్ రాజు, చుక్కా వరలక్ష్మి, పిలక రమణ, ఎదురు రాజు, శ్రీరామ్ మూర్తి, వెంకటేశ్వరరావు, సుబ్బలక్ష్మి, గోవిందా, భాస్కర్, అప్పలనాయుడు, పెద్దాడ అప్పలరాజు, రాంబాబు, కన్నబాబు, రామారావు, జగన్, శివాజీ, గౌరీ, నక్క రాము, ఇతర నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

59వ వార్డులో..

గాజువాక డిపో ఏరియాలోని శాంతిగిరి కాలనీ ఆర్చ్ వద్ద వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు, మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు రేవళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో రాజన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎదురు సత్యనారాయణ, పైడితల్లి, భూపతి నాయుడు, అర్జున్, కుంచారావు, డేవిడ్, డేనీ, ఎడ్ల సత్యనారాయణ, కోరాడ శ్రీను, సరోజ, గౌరి, వేచలపు లక్ష్మి, నందిని, తేజస్విని, ప్రసాద్, తిరుపతి, చందు, చిరంజీవి తదితర నాయకులు పాల్గొన్నారు.

60వ వార్డులో..

వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాయపురెడ్డి అనిల్‌కుమార్ సారథ్యంలో కోరమాండల్ సమీప జిల్లా ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్ టీయూసీ జోనల్ ఇన్‌చార్జి, 60వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ పి.వి.సురేష్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పూండీ మల్లేశ్వరరావు, అంగ వర్మ, చెరకాపు బుజ్జి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

61వ వార్డులో...

వైఎస్సార్‌సీపీ 61వ వార్డు అధ్యక్షుడు పిలక రామ్మోహనరెడ్డి ఆధ్వర్యంలో వార్డులోని మల్కాపురం తదితర ప్రాంతాల్లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు పండ్లు, రొట్టెలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామ్మోహనరెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర రెడ్డి పాలనలో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రాజెక్ట్‌లన్నీ నీటితో కళకళలాడాయన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పిల్ల కన్నబాబు, భోగవిల్లి నాగభూషణం, పీలా అనంత్, పీలా మాధవి, గౌస్, గోపిరాజ్, నూకరాజు, వెంకటేష్, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



59వ వార్డులో రాజన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రేవళ్ల సత్యనారాయణ తదితరులు



58వ వార్డులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గులివిందల కృష్ణ తదితరులు

పేదల గుండె చప్పుడు



వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న 62వ కార్పొరేటర్ లక్ష్మణరావు



రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు

సింధియా: పేదల హృదయాల్లో దైవంగా నిలిచిన స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతిని పారిశ్రామిక ప్రాంతంలో ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 62వ వార్డు గుడివాడఅప్పన్న కాలనీలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదప్రజలకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భీశెట్టి గణేష్, నాయకులు చింతా ప్రభాకర్, భారతి, ప్రసాద్, ఎంఎల్ నాయుడు, వెంకటరత్నం, చిన్నారావు, జీవన్, రామకృష్ణ, నూకరాజు, నారాయణ, శేషగిరిరెడ్డి, కుమార్, ఆటోస్టాండ్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రీపెయిడ్ ఆటో ట్యాక్సీలపై అవగాహన కల్పిస్తాం



సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ సన్యాసినాయుడు

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రీపెయిడ్ ఆటో ట్యాక్సీకి ఆదరణ పెంచేందుకు గోపాలపట్నం పోలీసులు చర్యలు చేపట్టారు. 'ప్రీపెయిడ్ ఆటోకు ఆదరణ కరువు' అనే శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి పోలీసులు స్పందించారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గోపాలపట్నం సీఐ ఎల్.సన్యాసినాయుడు మంగళవారం సాయంత్రం సింహాచలం రైల్వే స్టేషన్‌లో పర్యటించారు. ఆటో డ్రైవర్ల ఇబ్బందులు, ప్రచార లోపాల గురించి చర్చించారు. ప్రయాణికుల్లో అవగాహన కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నామని సీఐ తెలిపారు. ప్రయాణికుల్లో నమ్మకం, భరోసా కలిగేలా ఆటో డ్రైవర్లు మెలగాలని సూచించారు. స్టాండ్‌లో ఆటో డ్రైవర్లు అందరూ అందుబాటులో ఉండాలన్నారు. ప్రీపెయిడ్ ట్యాక్సీ కౌంటర్ తెలిసేలే ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అప్పలనాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యం పాలు

హెచ్‌పీసీఎల్, కోరమాండల్ ఇటు నేవీలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు అధిక శాతం ఈ ప్రాంతంలోనే నివాసముంటున్నారు. భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ శిథిలావస్థకు చేరకోవడంతో మురుగునీరు అంతా రోడ్లపైనే ప్రవహిస్తుంది. దుర్వాసనతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో ఎక్కువ మంది అనారోగ్యం బారిన పడుతున్నారు.



రోడ్డుపై చెరువును తలపిస్తున్న మురుగునీరు

ప్రత్యేక దృష్టి పెడితేనే..

మురుగునీటి ప్రవాహంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి మురుగు, వరదనీరు నిలిచిపోవడంతో దోమల బెడద పెరిగింది. ఇటువంటి సమస్య పునరావృతం కాకుండా ఉండాలంటే జీవీఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించాలి.

మురుగు వ్యథ.. దోమల బెడద

- పూడుకు పోయిన కాలువలు
- రోజుల తరబడి రోడ్లపై నీరు
- దుర్వాసనతో అవస్థలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు



కాకరలోవ గ్రామంలో డ్రైనేజీ నుంచి పొంగిపొర్లుతున్న మురుగునీరు

సింధియా: జీవీఎంసీ అధికారుల మధ్య సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారుతోంది. స్వచ్ఛత ర్యాంకుల కోసం వెంపర్లాడడం తప్పా పనిలో చిత్తశుద్ధి కనిపించడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పారిశుధ్య నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఎక్కడ చూసినా మురుగు నీరు.. చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఫలింతా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

ఇక్కడ మరీ ఘోరం

జీవీఎంసీ 63వ వార్డు పరిధి మల్కాపురం పోలీస్ స్టేషన్ నుంచి యారాడ వెళ్లే మార్గంలో నిత్యం ఏదో ఒక సమస్య తలెత్తుతూనే ఉంది. మల్కాపురం పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో ఎంఈఎస్ సెంటర్ వద్ద ప్రధాన రహదారిపై డ్రైనేజీ పొంగి మురుగునీరు రోడ్డుపై పారుతుంది. ఇది లోతట్టు ప్రాంతం కావడంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరు పోలీస్‌స్టేషన్ ఆవరణతో పాటు సమీప ఇళ్లల్లోకి చేరుతోంది. అంతేకాకుండా ఎగువ ప్రాంతాల నుంచి కాల్వల ద్వారా చెత్తాచెదారం, ప్లాస్టిక్ బాటిళ్లు దిగువకు కొట్టుకు రావడంతో అడ్డంగా పడుతున్నాయి. ఫలితంగా మురుగునీరు సాఫీగా ప్రవహించే వీల్లేక పొంగిపొర్లుతుంది.

- 62వ వార్డు గుడివాడఅప్పన్నకాలనీలో ప్రధాన గెడ్డ వద్ద నేవీ అధికారులు వ్యర్థాలు తమ నేవీ క్వార్టర్స్ వైపు వెళ్లకుండా ఇనుప చువ్వలు అమర్చారు. దీంతో ప్రధాన గెడ్డలో వ్యర్థాలు పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పలుమార్లు ఉన్నతాధికారులు, ఎంపీ, ఎమ్మెల్యేలకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది.

ఇబ్బందులు పడుతున్నాం



డ్రైనేజీలు పొంగి పొర్లడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దుర్వాసనతో బయటకు రాలేకపోతున్నాం. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. సమస్యను ఎవరి దృష్టికి తీసుకువెళ్లాలో తెలియడంలేదు.

–పార్వతి, మల్కాపురం

చర్యలు చేపట్టాలి



డ్రైనేజీ నిర్వహణ విషయంలో జీవీఎంసీ అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉండాలి. కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. శిథిలమైన డ్రైనేజీలకు మరమ్మతులు చేపట్టాలి. చెత్తాచెదారాలు తొలగించి బ్లీచింగ్ వంటివి చల్లాలి.

–రాజారావు, 63వ వార్డు

గలీజు



ఎన్‌ఏడీ జంక్షన్‌లో ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు ఫ్లైఓవర్ నిర్మించారు. ఇంత వరకూ బాగానే ఉన్న స్థానికులకు మాత్రం అవస్థలు వచ్చాయి. ఫ్లైఓవర్ దిగువన వ్యాన్లు, భారీ వాహనాలు రోజుల తరబడి పార్కింగ్ చేసి వదిలేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతోంది. ఇక్కడే బహిరంగంగా మద్యం సేవించడంతో పాటు పరిసరాలను గలీజు చేస్తున్నారు. మల మూత్రవిసర్జన అక్కడే చేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఎక్కడ చూసినా ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. చెత్తకూడా తరలించడం లేదు.దీంతో తమకు కష్టాలు వచ్చాయని స్థానికులు వాపోతున్నారు. మరో వైపు మందుబాబులు, ఆకతాయిల బెడద కూడా ఉందని మహిళలు చెబుతున్నారు. పోలీసులు నిఘా పెట్టాలని కోరుతున్నారు.



ఎన్‌ఏడీ అంబేద్కర్ విగ్రహం వద్ద చెత్త పోగులు



గ్రీన్ బెల్టులో రోడ్డుపై చెత్త



ఫ్లైఓవర్ దిగువన మద్యం సీసాలు

23 వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు

ఎంవీపీ కాలనీ : టీటీడీ ధర్మప్రచార పరిషత్ విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23 వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంవీపీలోని కార్యాలయ సిబ్బంది వెల్లడించారు. విశాఖ, అల్లూరి, అనకాపల్లి దేవాలయాల్లో భజనలు, ఉపన్యాలు, కుంకుమార్చనలు నిర్వహిస్తామని తెలిపారు.